# మృత్యువు నీడ

పెళ్ళికాక ముందు చాలా ఆనందంగా ఉండేది నీరజ. కానీ, పెళ్ళైన రోజునుంచి రోజూ ఏడుస్తూనే ఉంది. ఆమె పెళ్ళై ఆరు నెలలు సరిగ్గా ఆరు నెలలు. నీరజ పదోక్లాస్ చదువుతున్నది. ఆమె భర్త సుధీర్ బి.ఏ. చదువుతున్నాడు.

ఇంతకీ భర్త పెట్టే బాధలకి ఏడవడం లేదామె. పోనీ అత్తగారి ఆరళ్ళకి ఏడుస్తోందా అంటే అదీకాదు. ఆవిడ దేవత లాంటిది. పుట్టింటి వారిమీద బెంగా అంటే అదీ కాదు.

దానికి పూర్వ ఘట్టమిది. సంవత్సరన్నర కిందట ఓ గొప్ప జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్ళారు, నీరజ అత్తగారు సరళ, మామగారు సీతారామరావు. సరిగ్గా రెండేళ్ళకి సరళకి ప్రాణగండ మున్నదనీ.... అది ఏపరిస్థితుల్లోనూ తప్పదనీ ఢంకా బజాయించాడట ఆ మహాను భావుడు.

అందుకని సంవత్సరం తిరక్కుండానే ఇద్దరాడ పిల్లల పెళ్ళిళ్లు చేసేశారు. వాళ్ళకేం పాతికేళ్లు లేవు పెద్ద పిల్ల మాలతికి పదిహే నేళ్ళు, రెండో పిల్ల మాధవికి పధ్నాలుగేళ్లు. అబ్బాయి సుధీర్‌కి పద్దెనిమి దవ సంవత్సరం నడుస్తున్నది, బి.ఏ. చదువుతున్నాడు. ఈ సంవ

త్వరం బాధ్యత తీరుతుంది కదా అని అనుకోకుండా కలిసి వచ్చిన సంబంధం 15 సంవత్సరాల నీరజతో పెళ్లి జరిపించారు. అమ్మాయి టెన్తుక్లాస్ చదువుతున్నది.

పరీక్షలవుతూనే నీరజ కాపురానికి వచ్చింది. అత్తగారు సరళ ఆయుష్షు ఇంకా నాలుగు నెలలే ఉందని తెలిసిపోయింది. పాపం ఆమెకి నిండా నలభై ఏళ్ళుకూడ లేవు.

ఆవిడ నీరజకి అత్తగారిలా అనిపించలేదు. కన్నతల్లిలా ఉంది. నీరజను అసలు పనే చెయ్యనివ్వదు.... నీరజకు చిన్నప్పటినుంచి నవలలు చదవడం అలవాటు. టెన్త్‌క్లాసుకి వచ్చిన దగ్గర నుంచీ రోజూ పేపరు చదవటం అలవాటు చేసుకుంది. సినిమాలు చూస్తుంది. వారపత్రికలు, మాసపత్రికలు అందులో కథలు తెగ చదివేస్తుంది. అయితే, సర్వ సాధారణంగా ఆమె మనస్సులో నాటుకున్న అతి ప్రాధాన్యం వహించిన విషయం కట్నం కోసమో, మరిదేనికో కోడల్ని రాచి రంపాన పెట్టడం, కొట్టడం, మానసికంగా హింసించడం. ఈ బాధలు పడలేని కోడలు ఆత్మహత్య చేసుకోవడమో, లేక ఏ కిరోసినో పోసి అత్తగారు, మొగుడు కోడల్ని సజీవదహనం చెయ్యడమో. ఈ రకమైన వ్యవహారాలు చదివిన, విన్న నీరజకు అత్తవారింట్లో పరిస్థితి ఆశ్చర్యకరంగా ఉంది.

ఇక మామగార్ని చూద్దామా ఆయన అతి మంచివాడు. తన తండ్రి తన్నెంత ప్రేమగా, ఆప్యాయంగా చూస్తాడో సీతారామారావు గారుకూడా అంతే ఆప్యాయంగా పలకరిస్తాడు.

తను చాలా అదృష్టవంతురాలు అని అనుకుంటూనే ఉంటుంది నీరజ.

అయితే, ఒకటేమిటంటే ఇంట్లో వాతావరణంలో ఒక రకమైన దిగులు ఆవరించి ఉంటుంది. అదొక్కటే తట్టుకోవడం కష్టంగా ఉంది నీరజకు.

ఆమె స్వతహాగా చాలా చాలాకీ. సరదాగా కబుర్లు చెప్తూ, తుళ్లుతూ ఉండే స్వభావం. ఇక్కడ సరదాగా ఉండాలంటే భయమేస్తోంది. సరదాగా ఉండొద్దని ఎవరూ అనరు. అయినా ఏమనుకుంటారో?

నీరజ వయస్సుకి జాతకాలు నమ్మాలా వద్దా అనే విషయాన్ని నిర్ధారణ చేసుకునే పరిపక్వత, మానసికస్థాయీ లేకపోయినా బాగానే తిరుగుతున్న అత్తగారు ఎట్లా పోతుందో అర్థం కావడం లేదు. అయినా, అంత మంచి అత్తగారు పోతే ఎట్లా?.... అందుకె తలుచుకుంటే దుఃఖం వస్తూనే ఉంది నీరజకు.

అదీ నీరజ ఏడుపుకు కారణం.

ఆ రోజు లేస్తూనే గుబులు గుబులుగా ఏడుస్తూంది నీరజ.... సుధీర్ కంగారు పడ్డాడు.

"ఎందుకు? ఏమైంది?" అన్నాడు.

"అత్తగారు చచ్చిపోయినట్లు కలొచ్చిందండీ" అంటూ మళ్ళ బావురుమంది.

సుధీర్‌కు మతి పోయినట్లైంది.

నాన్న చూస్తే నిర్లిప్తంగా ఉంటారు.

నీరజ పరిస్థితి ఇట్లా ఉంది.

ఇక తల్లి సంగతి చెప్పనవసరం లేదు. టైమ్ దగ్గర పడిందన్న వైరాగ్య ధోరణిలో ఉంది.

జాతకాలను నమ్మడం సుధీర్‌కి అంతగా ఇష్టంలేదు. రెండు మూడు సార్లు ఇది అబద్ధం అని ఇంట్లో ప్రతిఘటించే ప్రయత్నం చేశాడు కానీ, తల్లీ, తండ్రి మాట్లాడే ధోరణికి వాదం పెంచుకునే ప్రయత్నం మానేశాడు.

నీరజ ఏడుపు విని కంగారుగా వచ్చింది, సరళ "ఏమైందమ్మా" అంటూ.

"ఏదో కల వచ్చి భయపడిందిలే" అని ఆ విషయాన్ని తేలిగ్గా తీసెయ్యడానికి ప్రయత్నించాడు సుధీర్.

వెక్కిళ్ళ మధ్య చెప్పింది నీరజ. "మీరు చచ్చిపోయినట్లు కలొచ్చిందత్తయ్యా" అని.

సీతారామారావుగారు గంభీరంగా తలపంకించి ఆ గదిలోంచి వెళ్ళిపోయినాడు. సరళకీ దుఃఖం వచ్చింది.

కోడల్ని కౌగిలించుకుని ఆమె ఏడ్చింది. కొంత సేపటికి సరళ తేరుకుని కోడలు కళ్లు తుడిచి బుజం తట్టి పని చేసుకోవడానికి వెళ్ళిపోయింది.

సరళకి జాతకం ప్రకారం చావు దగ్గరపడిందని అందరికీ తెలిసిపోయింది.

జ్యోతిష్కుడి మాట కొట్టి పారెయ్యడానికి వీల్లేదు. ఎందుకంటే అతడు బాగా పేరున్న వాడు, గొప్పవాడు. అంతేకాక అతను ఎప్పుడెప్పుడు ఏం జరుగుతుందని చెప్తాడో, ఆరునూరైనా, నూరు ఆరైనా జరిగి తీరుతుందట.

ఇప్పుడు సరళను అందరూ సానుభూతిగా చూస్తున్నారు. అయితే ఆమెకు ఏ జబ్బూ లేదు. హాయిగా తిని తిరుగుతున్నది. "ఎంత తిని తిరుగుతున్నా, హార్ట్ ఎటాక్ వస్తే ప్రాణం పోవడం ఎంత సేపు" అనుకున్నారు కొందరు సమర్థింపుగా.

"రాసిపెట్టి ఉంటే మృత్యువు ఏ రూపంలో వస్తుందో, ఎప్పుడొస్తుందో ఎవరికి తెలుసు?" అన్నారు మరి కొందరు.

కాలచక్రం ఆగలేదు తిరుగుతూనే ఉంది. కొందరికి వేగంగా, కొందరికీ స్తబ్దంగా, కొందరికి నిరాశగా, కొందరికి ఆనందంగా మరి కొందరికి భారంగా.

కథా నిలయం
1481
శ్రీకాకుళం

కాలం ఎన్నో వందల సంవత్సరాలనుంచి ఒకే రీతిగా నడుస్తోంది. అయితే మార్పు జరిగేదల్లా పరిస్థితుల్లో, వ్యక్తుల మనసుల్లో.

సీతారామారావుగారి కుటుంబంలో కాలం భారంగా నడుస్తోంది.

అమ్మ ఇంకా ఎక్కువ రోజులు కనబడదనుకుంటే పెళ్ళైన ఇద్దరాడ పిల్లలకి మనసు గందరగోళంగా ఉంది. ఏం చెయ్యాలో అర్థం కాకుండా ఉంది.

జ్యోతిష్కుడు చెప్పిన చావు గడువింకా పదిహేను రోజులుండనగా కూతుళ్ళిద్దరూ వచ్చారు. అల్లుళ్ళు ఓ నాలుగురోజులు ముందుగా వచ్చారు సెలవు పెట్టి. కూతుళ్లు, అల్లుళ్లు, కొడుకు, కోడలు, సరళ తల్లి. తండ్రి, సీతారామరావుగారి తల్లి తండ్రీ- ఇల్లంతా సందడిగా ఉంది.

చురుగ్గా తిరుగుతూ ఎవరెవరికి ఏమేం కావాలో చూస్తోంది సరళ, పెద్దకూతురు మాలతి కడుపుతో ఉంది. "మనుమణ్ని ఎత్తుకోకుండానే వెళ్ళిపోవలసి వస్తోంది" అని మాటిమాటికి కన్నీళ్ళు పెట్టుకుంటున్నది.

సరళ నేమీ పని చెయ్యవద్దని కూతుళ్ళు, కోడలు కట్టుదిట్టం చేశారు అందరూ ఆమెను కనుపాపలా చూసుకుంటున్నారు.

ఆమె చావు ఏ విధంగా వస్తుందా- అని అందరూ ఊహాగానాల్లోనే ఉన్నారు.

జ్యోతిష్కుడు పెట్టిన గడువింకా మూడురోజులుండనగా ఆ రోజు

రాత్రి భర్త దగ్గరగా వచ్చి కూర్చుంది సరళ. ఆమెకి మాట్లాడాలనుంది, అతనికి మాట్లాడాలని ఉంది. కానీ, ఏం మాట్లాడాలో ఎవరికీ తోచడం లేదు.

"ఏమండీ" అని గొంతు సవరించుకుంది. కానీ, దుఃఖంతో పూడుకు పోయింది గొంతు.

సీతారామారావు ఆమెను దగ్గరికి తీసుకున్నాడు. ఆ ప్రేమకు ఆమె కళ్ళలోని మేఘాలు వర్షించినై.

"మిమ్మల్ని వదిలి పోవాలని లేదండీ" అంది కొంత సేదదీరిన తరువాత.

"పిచ్చిదానా! నిన్ను వదిలి నేను మాత్రం ఉండగలనా? అందుకే కదా ముగ్గురు పిల్లలకీ పెళ్ళి చేశాం. బాధ్యతలు తీర్చుకున్నాం. నీ తరవాత నేనేమై పోయినా ఫరవాలేదు."

"కానీ, ఎందుకో చావంటే భయంగా ఉంది. ఇంతమందీ నా చావు కోసం ఎదురు చూస్తున్నారనిపిస్తోంది. నాకు చావు రాకపోతే...."

"సరళా! ఎట్లా జరిగేది అట్లా జరుగుతుంది. విధిరాతని మనం తప్పించలేము. జ్యోతిష్కుడు చెప్పిన గడువుదాటి గండం గడిచిందనుకో అందరూ ఆనందించే వాళ్ళేగానీ ఎందుకు చావలేదూ అని అడగరుకదా?"

"ఏమోనండీ నాకు బతకాలంటే భయమేస్తోంది." సరళ మాటల్లో ఆవేదన.

"నువ్వేమీ ఆలోచించక మనసు ప్రశాంతంగా ఉంచుకో సరళా! నీ చావుకోరే వాళ్ళెవరూ లేరు. ఒక గాడిలో నడుస్తున్న జీవన శకటం నుప్పు చావటం సంభవిస్తే ఒక పక్కకు ఒరిగిపోతుంది. దీనివల్ల ఎక్కు వగా నష్టపోయేది నేను. మనపిల్లల పెళ్ళిళ్ళై అందరూ సెటిలైపోయారు. సుధీర్ చదువు కాగానే ఉద్యోగంలో చేర్చగలిగితే ఇక మనకు బాధ్యత లంటూ ఉండవు. అప్పో సప్పోచేసి ఇల్లు కొనుక్కున్నాం. ఏం జరిగినా దైవంమీద భారం వేసి ఉండు...." సీతారామారావు ఏ పరిస్థితి ఎదురైనా, ఏ తాకిడికైనా ఎదురు నిలవగల మానసికధైర్యాన్ని ప్రయత్న పూర్వకంగా సాధించినట్లు ఆయన మాటల్లో ధ్వనిస్తోంది.

కానీ, సరళ మాత్రం ప్రశాంతంగా నిద్ర పోలేకపోయింది.

ఆ ఉదయం ఆమె మామూలుగా లేవలేదు.

ఇంటిల్లిపాదీ కంగారు పడ్డారు.

సరళకి, జ్వరంతో ఒళ్లు కాలిపోతూంది. మూసిన కన్ను తెరవ లేకుండా ఉంది.

నిమిషాల మీద డాక్టరు వచ్చాడు. పరీక్షించాడు. "ఆందోళన పడాల్సిందేమీ లేదు. మామూలు జ్వరమే" అని చెప్పి మందులు రాసిచ్చాడు

పోవడానికి ఏదో వంక కావాలి కనుక ఈ జ్వరం తగిలి ఉంటుంది. ఆమె పోవడం ఖాయం అనుకున్నారంతా. సరళ తల్లీ, తండ్రి తమ ముందు కూతురు పోవాల్సి రావడమేమిటని కుమిలిపోతున్నారు.

గంభీరంగా మౌనముద్రలో నిశ్శబ్దంగా తిరుగుతున్నది సీతారామా రావొక్కడే. మరి ఆయన మనసులో ఏ అగ్ని పర్వతాలున్నాయో ఎవ రికీ తెలియదు. వాళ్ళిద్దరిదీ చెప్పుకో దగ్గంత ఆదర్శ దాంపత్యం కాక పోయినా పొరపొచ్చాలు లేకుండా సాధారణ దాంపత్యం గడిపేవారు.

వాళ్ళ పెళ్ళై సరిగ్గా ఇరవై సంవత్సరాలు.

డాక్టరు రాసిచ్చిన మందులు వాడాక సాయంత్రానికి జ్వరం చాలా వరకూ తగ్గింది.

"తగ్గినట్లే తగ్గి కొంప ముంచుతుంది జ్వరం" అన్నది పక్కింటి పార్వతమ్మ గుసగుసగా.

కానీ, సరళకు ఒళ్ళు తేలిగ్గా, హాయిగా ఉంది.

ఇంట్లో ప్రతివాళ్లూ సరళ మొహంలోకి ఆందోళనగానూ, కుతూహ లంగానూ చూస్తున్నారు. ఆమె నీరసంగా కళ్లుమూసుకుని పడుకుంది. పరిస్థితి ఆమెకీ ఆందోళనకరంగానూ, బాధాకరంగానూ ఉన్నది.

"నీరసంగా ఉందామ్మా" అంటూ తల్లికి హార్లిక్స్ కలిపి తీసుకు వచ్చి ఇచ్చింది మాలతి. ఎవరేం మాట్లాడినావా "నువ్వింకా చావలేదేం!" అన్నట్లుగానే వినిపిస్తున్నదామెకు.

ఆ మధ్య రేడియోలో విన్న "కీర్తిశేషులు" నాటకమే పదే పదే గుర్తుకొస్తూంది. నవ్వొచ్చింది సరళకి.

"ఎందుకు నవ్వుతున్నావమ్మా" అంది మాలతి.

చెప్పింది "కీర్తిశేషులు" నాటకం గుర్తొచ్చిందని.

"అందులోలాగా అందరూ నా చావుకు ఎదురు చూస్తున్నారు. "కవిగారు చావవలసిందే" అని అందులో స్లోగన్స్ ఇచ్చినట్లు మీరివ్వడం లేదంతే...." అంది గొణుగుతున్నట్లు. ఆమె అనేది ఏమిటో, ఏం గును స్తున్నదో అర్థం కాలేదెవరికి.

"ఏమిటీ?" అంది మాలతి.

"ఏంలేదు" అని మళ్ళీ కళ్ళు మూసుకుంది. సరళకి తెల్లారడం ఇష్టంలేదు.

ఆమెకి మనసులో ఒకరకమైన ఆందోళన అయితే, అందరి మనసుల్లో మరొక రకమైన ఆందోళన. ఆ రాత్రి చాలాసేపు నిద్ర పట్ట లేదు. సరళకి, అర్ధరాత్రి దాటిన తరువాత మెల్లిగా లేచి వంట గది లోకి వెళ్ళి మంచి నీళ్లు తాగి వచ్చి పడుకుంది.

అప్పుడు కన్నులు మూత పడ్డాయి సరళకి.

* * *

"సరళా! లేచి మెల్లిగా మొహం కడుక్కో. కాఫీ తాగుదువు గాని, మందుకూడా వేసుకోవాలి." ఉదయం ఎనిమిది గంటలైనాక సీతారామా రావు సరళను భుజం తట్టి లేపాడు.

ఆమె కదలలేదు.

రెండు మూడుసార్లు పిలిచినా లేవకపోయేసరికి ఒళ్లు ముట్టుకు చూశాడు.

చల్లగా తగిలింది.

వెంటనే తెలిసిపోయింది సరళ ఇకలేదని లేవదనీ. బిగ్గరగా కేక పెట్టాడు. 'సరళా' అని. అందరూ సరళ మంచంచుట్టూచేరారు. ఏడ్చారు, హడావుడిగా డాక్టర్ని పిలుచుకొచ్చాడు.

ఆయన పరీక్షించి చెప్పాడు. 'నిద్ర మాత్రలు ఎక్కువగా వేసుకున్నందువల్ల ప్రాణం పోయింది' అని. ఎక్కువ మాత్రలు పొరబాటున వేసుకుందా, కావాలనా ? దిగ్భ్రాంతిగా చూస్తున్నాడు సీతారామారావు.

జ్యోతిష్కుడి కథనాన్ని ఎట్లా అన్వయించుకోవాలో తెలియక సీతారామారావుతో సహా అందరూ స్థాణువుల్లా నిలిచిపోయారు. ఎందుకంటే అతడు చెప్పిన చావు గడువు ఆ రోజే!

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 5-2-86)